సాక్షి హనుమకొండ

గురువారం । 20 । జూన్ । 2024



'చేతి' మరక వదిలిస్తారా?

టీజీఎస్ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో అకౌంట్స్ విభాగపు ప్రధాన అధికారిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై యాజమాన్యం శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. - 8లో▸



కేటుగాళ్ల బరితెగింపు..

సైబర్ నేరగాళ్లు బరితెగిస్తున్నారు.రోజురోజుకూ కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం, పోలీసు శాఖ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా వాటిని అరికట్టలేకపోతుంది. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$35^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నా సమయంలో ఎండ ఎక్కువ ఉంటుంది. సాయంత్రం వేళ పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

రామన్నపేట: టీజీ పాలిసెట్-2024 ప్రవేశాలకు నేటి (గురువారం) నుంచి వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. ఈనెల 24 వరకు జరిగే ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాలిసెట్-24లో క్వాలిఫై అయిన విద్యార్థులు సర్టిఫికెట్ ధ్రువీకరణ స్లాట్స్ ఎంచుకోవచ్చని తెలిపారు. 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ధ్రువీకరణ జరుగుతుందని, విద్యార్థులు తాము బుక్ చేసుకున్న స్లాట్ సమయానికి ఎంచుకున్న సెంటర్‌కి వెళ్లి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. విద్యార్థులు తమకు కావాల్సిన కోర్సులకు సంబంధించి WWW.TGPOLYCET.NIC.IN వెబ్ సైట్ ద్వారా ఆప్షన్స్‌ని ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు ఇచ్చుకోవచ్చని సూచించారు. ఆప్షన్స్‌ని నమోదు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 30న సీట్ల కేటాయింపు జరుగుతుందని, సీటు పొందిన విద్యార్థులు ఈనెల 30 నుంచి జూలై 7 వరకు వెబ్‌సైట్ ద్వారా ప్రవేశ రుసుము చెల్లించి సెల్ఫ్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు వారి అన్ని సర్టిఫికెట్స్ ఒరిజినల్‌తో పాటు ఒక కాపీ సెట్ జిరాక్స్ కూడా తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆప్షన్స్‌ను జాగ్రత్తగా ఇచ్చుకోవాల్సి ఉంటుందని, వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇవ్వాలని. యూజర్ ఐడీ, పాస్ వర్డ్ వివరాలు ఇతరులకు ఇవ్వకూడదని సూచించారు.

ఆర్టీసీ వరంగల్ ఆర్ఎంగా విజయభాను



హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌గా డి.విజయ భాను బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఆర్ఎంగా పని చేసిన జాన్సి శ్రీలత ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్‌గా బదిలీ కాగా.. హైదరాబాద్ చార్మినార్ డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్)గా పని చేస్తున్న డి.విజయ భానుకు పదోన్నతి కల్పించి వరంగల్ ఆర్ఎంగా నియమించారు. హనుమకొండలోని వరంగల్ రీజియన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. విజయభానుకు డిప్యూటీ ఆర్ఎంలు భాను కిరణ్, మాధవరావు, డిపో మేనేజర్లు వంగల మోహన్‌రావు, ధరంసింగ్, కార్గో ఏటీఎం పవన్ కుమార్, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు మొక్కలు, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు నులి పురుగుల నివారణ కార్యక్రమం

ఎంజీఎం: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నేడు (గురువారం) నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ బి.సాంబశివరావు తెలిపారు. జిల్లాలోని 1 నుంచి 19 ఏళ్ల వయస్సు పిల్లలందరికీ వారి తల్లిదండ్రులు నులిపురుగుల నిర్మూలన కోసం ఆల్బెండజోల్ మాత్రలు ఇప్పించాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ మాత్రలను భోజన అనంతరం ఇవ్వనున్నట్లు తెలిపారు. నులి పురుగుల వల్ల పిల్లలకు కడుపు నొప్పి, పోషకాహారలోపం, రక్తహీనత ఉంటుందని తద్వారా పిల్లలు చదువుపై శ్రద్ధ చూపలేరని వివరించారు. ఏదైనా కారణాలతో అందుబాటులో లేని పిల్లలకు ఈనెల 27న ఇవ్వాలని పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



షేక్ సలీమా, సెంట్రల్ జోన్ డీసీపీ



రాజమహేంద్ర నాయక్, వెస్ట్‌జోన్ డీసీపీ

హన్మకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్, వెస్ట్ జోన్ డీసీపీలుగా షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్ బుధవారం వారివారి కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. షేక్ సలీమా 2007లో గ్రూప్-1 అధికారి హోదాలో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టి కాగజ్‌నగర్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏసీపీగా, అదనపు ఎస్పీగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో, ఎస్పీగా రైల్వే విభాగంలో పని చేశారు. అదేవిధంగా 2010 గ్రూప్-1 అధికారి హోదాలో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రాజమహేంద్రనాయక్ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సీసీఎస్ ఏసీపీగాను, ములుగు, మహబూబాబాద్ డీఎస్పీగా పని చేసి అదనపు ఎస్పీగా పదోన్నతిపై భూపాలపల్లి జిల్లాకు వెళ్లారు. అక్కడి నుంచి ఎస్పీగా పదోన్నతి పొంది కరీంనగర్ జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీగా పనిచేశారు.

దేవాదుల-3వ దశకు మరో రూ.550కోట్లు

- అవసరమని మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లిన అధికారులు
- రెండున్నర నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేయాలని మంత్రి ఆదేశం
- వేర్వేరుగా మైనర్, మేజర్ ఇరిగేషన్ చేయాలన్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు
- నగరంలో ముంపునకు గురి కాకుండా నాలాల అభివృద్ధికి దిశానిర్దేశం
- నీటిపారుదలపై హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం



సమీక్షలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో మంత్రులు పొంగులేటి, సీతక్క, ఎమ్మెల్యేలు, అధికారులు

హసన్‌పర్తి: మరో రూ.550కోట్లు విడుదల చేస్తే దేవాదుల ప్రాజెక్టు-3వ దశ పనులు పూర్తవుతాయని ఇరిగేషన్ అధికారులు.. రాష్ట్ర భారీ నీటి పారుదలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సారెస్పీ, దేవాదుల ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమావేశం హైదరాబాద్‌లో జలసౌధలో మంగళవారం రాత్రి జరిగింది. సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. దేవాదుల ప్రాజెక్టు-3పై జరిగిన చర్చ సందర్భంగా పలు అంశాలు ప్రస్తావించారు. ప్రస్తుతం దేవాదుల ప్రాజెక్టు-3వ దశ పనులు 90 శాతం పూర్తయినట్లు మంత్రి ఉత్తమ్ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. కాంక్రీట్‌తోపాటు ఇతర పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకు నిధులు మంజూరు చేస్తే ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. డిస్ట్రిబ్యూటరీ, కాల్వలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. 1.5లక్షల ఎకరాలకు నీరు అందించగలమని అధికారులు మంత్రికి వివరించారు. ఈఅంశంపై ప్రతిపాదనలు తయారు చేయాలని మంత్రి సూచించారు. రెండున్నర నెలల్లోనే దేవాదుల-3 దశ ద్వారా నీరు అందించాలని ఆదేశించారు.

నీటి కేటాయింపుల్లో కుదింపు

చర్చ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మాట్లాడారు. గతంలో దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం 60 టీఎంసీల నీటి కేటాయింపు జరిగిందన్నారు. ప్రస్తుతం దాన్ని 38.15 టీఎంసీలకు కుదించారని తెలిపారు. దేవాదుల-1, 2, 3 దశల్లో నీటిని లిఫ్ట్ చేయడానికి 38.16 టీఎంసీలు సరిపోవన్నారు. కేటాయింపులు పెంచడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు-2లో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబుపేట రిజర్వాయర్ వరకు 31 కిలోమీటర్ల వరకు ప్రధాన కాల్వ మంజూరైనట్లు వివరించారు. దీనిద్వారా స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ కింద 28,.800ఎకరాలు, చెన్నూరు రిజర్వాయర్ కింద 25,200 ఎకరాలు, నవాబుపేట రిజర్వాయర్ కింద 53,400 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. నవాబుపేట రిజర్వాయర్ ద్వారా స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, ఆలేరు నియోజకవర్గాల్లోని 1,07,400 ఎకరాలకు సాగునీరు అందించడానికి శాశ్వత ప్రాతిపదికన ప్రధాన కాల్వలకు ఇరువైపులా లైనింగ్, పూడిక తొలగింపు, జంగిల్ క్లియరెన్స్, ఓటీలు, డీఎల్ఆర్ బిల్లు, తూములు, షట్టర్ల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పాత పద్ధతి ప్రకారమే మైనర్, మేజర్ ఇరిగేషన్‌లు వేర్వేరుగా ఏర్పాటు చేయాలని జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాన్ని వ్యక్తపర్చారు. రైతులకు కూడా తగిన విధంగా ప్రయోజనం కలుగుతుందన్నారు.

కాల్వల పనులు చేపట్టాలి

పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ పనులు వెంటనే చేపట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. అధికారులను ఆదేశించారు. ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టులోని పలు ప్రాంతాల్లో ప్రధాన కాల్వలు, ఉపకాల్వలు దెబ్బతిన్నాయని మంత్రి చెప్పారు. మరమ్మతులకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. గతేడాది దెబ్బతిన్న కాలవ్వలు, చెరువుల నివేదికను వెంటనే అందించాలన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, రాంచందర్‌నాయక్, మురళీనాయక్, ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, ఈఎన్‌సీలు నాగేందర్, అనిల్‌కుమార్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాలాల అభివృద్ధికి రూ.140 కోట్లు

గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో నాలాల అభివృద్ధికి రూ.140 కోట్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. వర్షాకాలంలో నగరంలోని కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భద్రకాళి చెరువుతోపాటు ఇతర చెరువుల నాలాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తాం



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏల వారసులు

పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

దామెర: రాష్ట్ర ప్రజలకు జవాబుదారీగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి, ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోలం కృపాకర్ రెడ్డి, ఎంపీటీసీలు గందు రాము, శనిగరం కళాసుధాకర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు బిల్లా రమణారెడ్డి, బీరం సుధాకర్‌రెడ్డి, గుడిపాటి శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, నాయకులు హింగె నాగేశ్వర్‌రావు, సదిరం పోశాలు, పాలకుర్తి సందీప్, మహిళలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జీఓను వర్తింపజేయాలి..

గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ఎంఎస్ 81, 85 ప్రకారం 61 సంవత్సరాలు పూర్తి చేసిన 3,797 మంది వీఆర్ఏల వారసులను క్రమబద్ధీకరించాలని కొంతమంది వారసులు బుధవారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నాణ్యత పరిశీలించాకే బిల్లులు చెల్లించండి

కలెక్టర్ ప్రావీణ్య



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హసన్‌పర్తి: పాఠశాలల్లో చేపట్టిన పనుల నాణ్యతను పరిశీలించిన తర్వాతే బిల్లులు చెల్లించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. హసన్‌పర్తి మండలం హరిశ్చంద్రనాయక్ తండా, అర్వపల్లిలో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలని సూచించారు. బడీడు పిల్లల్ని బడిలో చేర్పించాలని, ఇందుకు స్థానిక యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈసందర్భంగా పాఠశాలల్లో ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ జరిగిందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్వపల్లి పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ హై, ఎంపీపీ సునీత, ఎంపీడీఓ ప్రవీణ్, ఎంపీఓ రవిబాబు, ఏపీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పదోన్నతుల కల ఫలించిన వేళ..

- ఐదు జిల్లాల్లో 1,768మంది టీచర్లకు పదోన్నతులు
- ఉత్తర్వులు చేతికందడంతో పలువురు విధుల్లో చేరిక
- ఎస్ఏ పీడీలుగా పీఈటీలు, లాంగ్వేజ్ పండిట్లకు ఎస్ఏలుగా, ఎస్‌జీటీలకు పీఎస్‌హెచ్ఎంలు, ఎస్ఏలుగా ఉద్యోగోన్నతి
- వరంగల్‌లో మరో 76మంది, ములుగులో 54మంది వెయిటింగ్



విద్యారణ్యపురి: దశాబ్దంన్నర కాలంగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న ప్రభుత్వ, లోకల్‌బాడీ యాజమాన్యాల పరిధి లాంగ్వేజ్ పండిట్ల (తెలుగు, హిందీ, ఉర్దూ)కు స్కూల్ అసిస్టెంట్‌లుగా, పీఈటీలు ఎస్ఏ పీడీలుగా ఎట్టకేలకు పదోన్నతులు లభించాయి. వీరికి బుధవారం ఉత్తర్వులు ఇవ్వడంతో పోస్టింగ్ స్థానాల్లో జాయిన్ అవుతున్నారు. తొమ్మిదేళ్లుగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ)కు కూడా పదోన్నతులు లభించాయి. వీరికి పీఎస్‌హెచ్ఎంలుగా, ఎస్ఏ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ, మ్యాథ్స్, బయాలజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, కేటగిరీలో పదోన్నతులు కల్పించారు. మల్టీజోన్-1 పరిధి ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జయశంకర్ భూ పాలపల్లి, ములుగు జిల్లాలోని ప్రభుత్వ, లోకల్‌బాడీ యాజమాన్యాల పరిధిలో అన్ని కేటగిరీలు కలిపి 1,768మందికి పదోన్నతులు కల్పించారు.

జిల్లాల వారీగా ఇలా..

- హనుమకొండ జిల్లాలో 454మంది పదోన్నతులు పొందారు. వరంగల్ జిల్లాలో 434 మంది పదోన్నతులు పొందాల్సి ఉండగా, అందులో లోకల్‌బాడీలో పీఎస్‌హెచ్ఎం, ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లు, ప్రభుత్వ యాజమాన్య పరిధి స్కూల్ అసిస్టెంట్ పీడీలు 76మందికి పదోన్నతుల ఉత్తర్వులు రావాల్సింది. రోస్టర్‌లో తలెత్తిన సమస్యతో మళ్లీ పరిశీలించినట్లు సమాచారం. రాత్రి వరకు పదోన్నతుల ఆర్డర్స్ వస్తాయని భావిస్తున్నారు. మిగతా 358 మందికి ఉత్తర్వులు అందాయి.
- ములుగు జిల్లాలో 217 మందికి పదోన్నతులు కల్పించగా 163 మందికి ఉత్తర్వులు అందాయి. పీఎస్‌హెచ్ఎం 39మందికి, ఎస్ఏ ఇంగ్లిష్ 15మంది.. మొత్తంగా 54 మంది టీచర్లకు ఉత్తర్వులు రావాల్సింది.
- మహబూబాబాద్ జిల్లాలో 517మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 276మంది పదోన్నతులు పొందారు.
- ఎక్కువశాతం మంది పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు తమకు వెబ్ ఆప్షన్ల ప్రకారం కేటాయించిన ఉన్నత పాఠశాలలు, అక్కడక్కడా యూపీఎస్‌లలో విధుల్లో చేరారు.

కొందరు ఎస్‌జీటీలకు రెండింటిల్లోనూ పదోన్నతులు

ఉమ్మడి జిల్లా పరిధిలోని ఐదు జిల్లాలో కొందరు ఎస్‌జీటీలకు రెండింటిల్లోనూ పదోన్నతులు లభించినట్లు సమాచారం. ఎస్‌జీటీ కేడర్‌లోని వారికి పీఎస్‌హెచ్ఎంలుగా, విద్యార్హతలను బట్టి ఇతర సబ్జెక్టుల్లో ఎస్ఏలుగా పదోన్నతి పొందే అవకాశం ఉంది. దీంతో హనుమకొండ జిల్లాలో అలా రెండు పోస్టుల్లోనూ పదోన్నతి పొందిన వారు 50మంది వరకు, మహబూబాబాద్ జిల్లాలో 30మంది వరకు ఉంటారని తెలుస్తోంది. వరంగల్ జిల్లాలో ఒక టీచర్‌కు మాత్రం రెండు సబ్జెక్టుల్లో పదోన్నతి లభించినట్లు తెలిసింది. మిగతా జిల్లాల్లోనూ పలువురు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. వీరు ఏదో ఒక పోస్టులో విధుల్లో చేరితే మిగతా పోస్టు ఖాళీగా ఉంటుంది.

ములుగు జిల్లాలో 247 మంది వరకు అవకాశం ఉన్నా..

ములుగు జిల్లాలో 247 మంది టీచర్లకు పదోన్నతి అవకాశం ఉన్నప్పటికీ అర్హులైనవారు లేక 217 మందికే లభించినట్లు ప్రాథమిక సమాచారం. ఇదిలా ఉండగా జనగామ జిల్లా మల్టీజోన్-2 పరిధిలో ఉండడంతో అక్కడ ఆ జోన్‌తోపాటు జరుగుతాయని విద్యాశాఖాధికారులు తెలిపారు.

హనుమకొండ జిల్లాలో పదోన్నతుల ఇలా

హోదా	ప్రభుత్వ	ఎల్‌బీ	మొత్తం
పీఎస్ హెచ్ఎం	05	44	49
ఎస్ఏ తెలుగు	03	87	90
ఎస్ఏ హిందీ	06	88	94
ఎస్ఏ ఇంగ్లిష్	04	13	17
ఎస్ఏ మ్యాథ్స్	03	31	34
ఎస్ ఫిజికల్‌సైన్స్	01	07	08
ఎస్ఏ బయోసైన్స్	05	40	45
ఎస్ఏ సోషల్ స్టడీస్	07	48	55
ఎస్ఏ బయోసైన్స్, ఉర్దూ	02	0	02
ఎస్ఏ సోషల్ స్టడీస్, ఉర్దూ	01	0	01
ఎస్ఏ ఉర్దూ	02	--	02
ఎస్ ఫిజికల్ ఎడ్యుకేషన్	08	48	56
ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్	--	01	01
మొత్తం	47	407	454

పదోన్నతి లభించలేదని పండిట్ల నిరసన



హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద ననిరసన తెలుపుతున్న లాంగ్వేజ్ పండిట్లు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న కొందరు గ్రేడ్-2 పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లాలో 13మంది తెలుగు పండిట్లకు, 12మంది హిందీ పండిట్లకు పదోన్నతులు లభించలేదని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య తెలిపారు. వారికి సాధ్యమైనంత త్వరగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ మేరకు డీఈఓ దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు.

బడ్జెట్‌పై చర్చ.. రచ్చేనా?

- మేయర్‌పై విపక్షాల నిరసన గళం
- అనర్హురాలిగా ప్రకటించాలని డిమాండ్
- బీఆర్ఎస్‌తో జతకట్టిన కొంతమంది బీజేపీ కార్పొరేటర్లు
- నేడు గ్రేటర్ వరంగల్ బడ్జెట్

వరంగల్ అర్బన్: భారీ అంచనాలతో సిద్ధం చేసిన వరంగల్ మహానగర పాలక సంస్థ బడ్జెట్‌ను పాలక పక్షం గురువారం ఉదయం కౌన్సిల్ ముందుకు తెస్తోంది. మేయర్ గుండు సుధారాణి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండగా.. ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండా యథావిధిగా ఆమోదింపజేసేందుకు అధికార పక్షం ప్రయత్నిస్తోంది. బడ్జెట్ అంచనాలపై విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను రూ.652 కోట్ల అంచనాలు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రజలపై పెద్దగా భారం లేకుండానే 2023-24 బడ్జెట్ అంచనాలను కొంచెం అటు.. ఇటుగా అంకెల గారడీ చేసినట్లు తెలిసింది.

వ్యూహ, ప్రతివ్యూహాలు

గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశానికి పాలక, ప్రతిపక్షాలు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకున్నాయి. కౌన్సిల్‌లో అధికార పార్టీ తీరును ఎండగట్టేందుకు ప్రతిపక్షాలు సై అంటుంటే.. విమర్శలు తిప్పికొడతామని పాలక పక్షం చెబుతోంది. గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి బీఆర్ఎస్ నుంచి ఎన్నికై.. కొద్ది నెలల కిందట కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. మేయర్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని, బడ్జెట్ సమావేశం నిర్వహించేందుకు అనర్హురాలంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు రెండ్రోజులుగా బాహాటంగానే విమర్శిస్తున్నారు. వీరికి కొంత మంది బీజేపీ కార్పొరేటర్లు సహకారం అందిస్తుండడంతో వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మేయర్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశాన్ని అడ్డుకోవాలని ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు హనుమకొండలో వ్యూహ, ప్రతివ్యూహాలు రచించినట్లు సమాచారం. బీఆర్ఎస్ కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశాన్ని ఎలాగైనా అడ్డుకోవాలని హితబోధ చేసినట్లు తెలిసింది. మంత్రి, ఎమ్మెల్యేలు కూడా విపక్షాల నుంచి ఎదురయ్యే సమస్యను ప్రతిఘటించాలని సూచనలు చేసినట్లు సమాచారం.

కలెక్టర్, కమిషనర్లకు వినతి

బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు మేయర్ సుధారాణికి అర్హత లేదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. గుండు సుధారాణి బీఆర్ఎస్ నుంచి కార్పొరేటర్‌గా, మేయర్‌గా ఎన్నికై .. కాంగ్రెస్ పార్టీలో చేరారని, స్థానిక సంస్థల పార్టీ ఫిరాయింపుల చట్ట ప్రకారం.. సుధారాణి కార్పొరేటర్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, కమిషనర్లను కలిసిన వారిలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఉన్నారు.

ముగిసిన మొక్కు 'బడిబాట'



పదోన్నతులు, బదిలీల ఎఫెక్ట్

విద్యారణ్యపురి: ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన బడిబాట మొక్కుబడిగానే బుధవారంతో ముగిసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు తమ పాఠశాలల పరిధిలో బడిబాట ర్యాలీలు, కరపత్రాలు పంపిణీ చేస్తూ.. ఇంటింటా.. ప్రచారం కల్పించారు. బడి బయట ఉన్న విద్యార్థులను బడీడు పిల్లలను గుర్తించేందుకు ఉపక్రమించారు. ఇంతలో ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు ఒకే చెప్పింది. షెడ్యూల్ కూడా విడుదలవ్వడంతో ఇక తాము పని చేసే పాఠశాల నుంచి పదోన్నతులు పొందే, బదిలీ అయ్యే ఉపాధ్యాయులు బడిబాటపై అంతగా ఆసక్తి కనబర్చలేదని సమాచారం. పదోన్నతి లభిస్తుందా.. లేదా? సీనియార్టీ జాబితాల్లో అభ్యంతరాలు తెలియజేయడం వంటి వాటితోపాటు కొందరు బదిలీలపై, పదోన్నతులపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించారు.

అంతంత మాత్రమే..

ఉపాధ్యాయుల్లో బడిబాట కార్యక్రమానికంటే కూడా బదిలీలు, పదోన్నతులపైనే చర్చ కొనసాగింది. బదిలీలు, పదోన్నతులు పొందబోమనే ఉపాధ్యాయులు మాత్రమే బడిబాటలో భాగస్వాములైనట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం.. పలు కార్యక్రమాల నిర్వహణ అంతంత మాత్రంగానే జరిగింది. ఒకట్రెండు రోజులు మాత్రం ప్రజాప్రతినిధులు, అధికారులు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. జిల్లాలో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లను కానీ.. ఇప్పటికీ పూర్తిగా మూతబడిన స్కూళ్లను తెరిపించేలా అందుకు విద్యార్థులను చేర్పించేలా సంబంధిత ఉపాధ్యాయులు కృషి చేయలేకపోయినట్లు సమాచారం.

క్రీడాపోటీలు లేనట్లేనా?

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో వివిధ కేటగిరీలు కలిపి 508 పాఠశాలలున్నాయి. బుధవారం బడిబాట షెడ్యూల్ ప్రకారం.. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించాల్సి ఉండగా.. వివిధ పాఠశాలల్లో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు తాము పనిచేసే పాఠశాలల నుంచి రిలీవ్ అయి తమకు కేటాయించిన పాఠశాలల్లో జాయిన్ అయ్యే ప్రక్రియ కొనసాగింది. అధికారులు కూడా ఎక్కువగా పదోన్నతుల బదిలీల ప్రక్రియపైనే దృష్టిసారించాల్సి రావడంతో బడిబాటను పర్యవేక్షించే అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతమేర ఎన్‌రోల్‌మెంట్ జరిగిందనేది డేటా పాఠశాలల హెచ్ఎంల నుంచి డీఈఓ కార్యాలయం అధికారులు సమాచారం సేకరించాల్సి ఉంది.

అక్రిడిటేషన్ కార్డుల కాల పరిమితి పొడిగింపు

వరంగల్: రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ (గుర్తింపు కార్డు)ల కాల పరిమితిని సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లుగా డీపీఆర్ఓ ఆయూబ్ అలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు పొడిగిస్తూరాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్లుగా ఉన్న కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొనట్లు తెలిపారు. జర్నలిస్టుల కోసం రెండేళ్లకోసారి అక్రిడిటేషన్ కార్డుల సదుపాయం రాష్ట్ర సమాచార శాఖ కల్పిస్తోందని, ఈనెల 30తో గడువు ముగుస్తుండగా.. సెప్టెంబర్ వరకు పొడిగించినట్లు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

వరంగల్: అధికారులు సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. వరంగల్ కలెక్టర్‌గా పనిచేసి హనుమకొండకు బదిలీపై వెళ్లిన ప్రావీణ్యకు నూతన కలెక్టర్ సత్య శారదాదేవి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీవాకడే, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి అధ్యక్షతన జిల్లా అధికారుల సమక్షంలో వరంగల్ కలెక్టరేట్‌లో బుధవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో శాసనసభ, లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికలు, దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. నూతన కలెక్టర్ సత్యశారదాదేవికి ఇదే సహకారం అందించి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలపాలని ఆకాంక్షించారు. జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీసీఓ సంజీవరెడ్డి, ఆర్డీఓలు సిదం దత్తు, కృష్ణవేణి, టీజీఓస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, ట్రెస అసోసియేట్ రాష్ట్ర ప్రెసిడెంట్ రియజొద్దీన్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఇక్బాల్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు రాంకిషన్, టీఎన్జీవోస్ ఉపాధ్యక్షుడు రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు డీవార్మింగ్ డే

గీసుకొండ: జిల్లాలో గురువారం నులిపురుగుల నివారణ (డీవార్మింగ్ డే) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వరంగల్ డీఎంహెచ్ఓ కె.వెంకటరమణ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో 1నుంచి 19 సంవత్సరాల వయస్సు గల 1,90,781 మందికి నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు ఏ ర్పాట్లు చేశామన్నారు. పీహెచ్‌సీల డాక్టర్లు, ఆర్‌బీఎస్‌కే మొబైల్ హెల్త్ టీంలు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రోగ్రాం అధికారులు కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాలని కోరారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

ఖిలా వరంగల్: పెళ్లి కావడం లేదని, ఇంటి నిర్మాణానికి చేసిన అప్పు తీర్చే పరిస్థితి లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్ శివనగర్‌లోని ఏసీరెడ్డినగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కోమరాజు జంపయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు శివ(33) ట్రాలీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల బ్యాంకులో అప్పు తీసుకుని ఇల్లు నిర్మించాడు. ఇంటి నిర్మాణానికి చేసిన అప్పు తీర్చే పరిస్థితి లేక, పెళ్లి కూడా కావడం లేదని మనస్తాపానికి గురై బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడు తండ్రి జంపయ్య వెంటనే మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందజేయగా .. వివరాలు సేకరించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. జంపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లయ్య తెలిపారు.

ఆడుకుంటూ అనంతలోకాలకు..

- ట్రాక్టర్ కిందపడి చిన్నారి మృతి


మోహనశ్రీ(ఫైల్)

గూడూరు: ఓ చిన్నారి ఆడుకుంటూ అనంతలోకాలకు చేరింది. ట్రాక్టర్ కింద పడి మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం గూడూరు మండలంలోని మట్టివాడలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మేడ జయంత్ ఇంటి ఎదుట ట్రాక్టర్ నిలిపి డ్రైవర్ పక్కకు వెళ్లాడు. అదే సమయంలో అక్కడే ఆడుకుంటున్న మేడ జయంత్ కూతురు మోహనశ్రీ (3) ట్రాక్టర్ వద్దకు వెళ్లి క్లచ్ రాడ్ పట్టుకుని నిలబడింది. దీంతో ట్రాక్టర్ కదలడంతో టైర్ కింద పడి తీవ్రంగా గాయపడింది. వెంటనే గుర్తించిన తల్లిదండ్రులు మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. ఈ ఘటనపై జయంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు.

‘చేతి’ మరక వదిలిస్తారా?



ఆర్టీసీలో అధికారి చేతివాటంపై శాఖాపరమైన విచారణ

- సదరు అధికారి అవినీతిపై ఇప్పటికే విచారణ చేసి ఆర్టీసీ విజిలెన్స్
- గుట్టుగా విచారణ అధికారుల వివరాలు

హన్మకొండ : టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో అకౌంట్స్ విభాగపు ప్రధాన అధికారిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై యాజమాన్యం శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. ‘ఆర్టీసీ అధికారి చేతి వాటం’, ‘సాక్ష్యం చెప్పొద్దు’ అనే శీర్షికలతో ‘సాక్షి’లో మార్చి 24, 31 తేదీల్లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి నివేదికను యాజమాన్యానికి అందించారు. తర్వాత సమగ్ర విచారణ కోసం శాఖపరమైన విచారణకు ఆదేశించిన యాజమాన్యం.. సీనియర్ అకౌంట్స్ అధికారితో కమిటీ వేశారు. ఈ కమిటీ విచారణ ప్రారంభించినట్లు సమాచారం. కాగా, అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడొచ్చు కానీ విచారణ అధికారుల వివరాలు మాత్రం బయటకు వెల్లడించొద్దనే ధోరణిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విచారణ ఎవరు చేస్తున్నారో స్పష్టంగా తెలియకపోతే ఎంక్వైరీ పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరుగుతుందని ఎలా నమ్మాలనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

బిల్లు ఇచ్చేందుకు డబ్బు డిమాండ్..

వరంగల్ రీజియన్ కార్యాలయంలో అద్దె బస్సుల యాజమానులకు పెరిగిన కిలో మీటర్లకు బిల్లు ఇచ్చేందుకు అకౌంట్స్ విభాగం ప్రధాన అధికారి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆర్టీసీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. 2009లో అద్దె బస్సులకు టెండర్లు పిలిచారు. ఇందులో ఈ బస్సులు హనుమకొండ నుంచి హైదరాబాద్ వెళ్లి, తిరిగి హనుమకొండకు చేరుకుని ఇక్కడి నుంచి వేములవాడకు వెళ్లాలి. అయితే ఆ తర్వాత హైదరాబాద్ ట్రిప్పు క్యాన్సల్ చేసి రెండు ట్రిప్పులు వేములవాడకు తిప్పారు. హైదరాబాద్‌తో చూస్తే వేములవాడ దూరం ఎక్కువగా ఉంటుంది. అయితే బిల్లులు మాత్రం హైదరాబాద్ ఒక ట్రిప్పు, వేములవాడ ఒక ట్రిప్పు చెల్లించుకుంటూ వచ్చారు.

ఉద్యోగానికి ఎసరు వస్తుందని నాయకులతో మధ్యవర్తిత్వం

తన ఉద్యోగానికి ఎక్కడ ఎసరు వస్తుందోనని సాక్ష్యం చెప్పొందంటూ సదరు అధికారి.. అద్దె బస్సుల యజమానుల సంఘం నాయకులతో మధ్యవర్తిత్వం జరిపారు. ఇదిలా ఉండగా వరంగల్ రీజియన్ కార్యాలయంలోని నాలుగో తరగతి ఉద్యోగి నుంచి ఆర్ఎం వరకు అధికారులు, ఉద్యోగులు తనకు సహకరించడం లేదంటూ సదరు అధికారి వారిపై ఆగ్రహావేశాలు వెళ్లగక్కుతున్నారని ఉద్యోగ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. కార్యాలయం అధికారులు, ఉద్యోగులతో అకౌంట్స్ విభాగం ప్రధాన అధికారి ఉప్పు నిప్పు అన్నట్లు ప్రవర్తిస్తోందని పేరు చెప్పడానికి ముందుకు రాని ఓ అధికారి తెలిపారు. విచారణ ఎవరు చేస్తున్నారో ఆ అధికారుల పేరు చెప్పడానికి కూడా ఏ ఒక్క అధికారి సాహసించడం లేదంటే ఆ అధికారి వ్యవహార శైలి ఏ మేరకు ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. విచారణ అధికారుల వివరాలు గుట్టుగా ఉంచడంలో ఏదైనా అంతర్యం దాగి ఉందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విచారణ అధికారులను కూడా ప్రభావితం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులు ఇప్పటి వరకూ వరంగల్ రీజియన్‌కు వచ్చి విచారణ చేపట్టలేదని తెలిసింది. అయితే అద్దె బస్సుల యజమానులకు డిపో స్థాయి అధికారి ద్వారా కరీంనగర్‌లోని కార్యాలయానికి విచారణకు రావాలని నోటీసులు పంపినట్లు ప్రచారం జరుగుతుంది. అద్దె బస్సుల యజమానులు మాత్రం తమకు నోటీసులు అందలేదని చెప్తున్నారు. ఇదిలా ఉండగా ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ వద్ద కూడా పర్సంటేజీలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచారణ అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, విచారణ జరపాలని పలువురు కోరారు.

బకాయిలు చెల్లించకుండా ముప్పతిప్పలు..

హనుమకొండ-కరీంనగర్ మధ్య తిరిగే రెండు బస్సులు, హనుమకొండ-వేములవాడ మధ్య తిరిగే రెండు బస్సులు నిర్ణీత కిలో మీటర్ల కంటే తక్కువ కిలో మీటర్లకు ఆర్టీసీ అద్దె చెల్లించింది. దీనిపై అద్దె బస్సుల యజమానులు కోర్టుకు వెళ్లగా సర్వే చేసి వాస్తవ దూరం లెక్కించి బకాయిలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్న ఈ అధికారి వారికి బకాయిలు చెల్లించకుండా కార్యాలయం చుట్టు తిప్పుకుంది. బకాయిలు పెద్ద మొత్తం చెల్లించాల్సి రావడంతో పర్సంటేజీ తీసుకోవాలనే ఆలోచనతో కాలయాపన చేస్తూ వచ్చింది. తిరిగి తిరిగి వేసారిన అద్దె బస్సుల యజమానులు చివరకు పర్సంటేజీలు ముట్టజెప్పేందుకు ముందుకు వచ్చారు. 2016లో వారికి రావాల్సిన బకాయిల సొమ్మును రాబట్టుకునేందుకు రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు తీసుకుందని ప్రచారం జరుగుతోంది. మొత్తానికి అద్దె బస్సుల యజమానులు పర్సంటేజీలు ముట్టజెప్పి చెక్కులు తీసుకున్నారు.

భవిష్యత్ కార్యాచరణపై ఎర్రబెల్లి సమీక్ష

- 5 గంటలపాటు కార్యకర్తల అభిప్రాయాల సేకరణ
- మీడియాకు అనుమతి నిరాకరణ
- మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ మారుతారనే ప్రచారం!


మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్

పర్వతగిరి: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్వతగిరిలోని తన స్వగృహంలో పాలకుర్తి నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తలతో భవిష్యత్ కార్యాచరణపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సుమారు వంద మంది పార్టీ ముఖ్య కార్యకర్తలతో 5గంటల పాటు నిర్వహించిన సమావేశంలో అభిప్రాయాలు సేకరించారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి కార్యకర్తలు పడుతు న్న ఇబ్బందులు, పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరాజయానికి గల కారణా లు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. పార్టీ కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా నిర్ణయాలు ఉంటాయని, బీఆర్ఎస్ బలోపేతానికి, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్ వీడుతారనే ప్రచారం!

పార్టీ మారాలనే ఆలోచనతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఐదుగంటలపాటు ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సేకరించినట్లు సమాచారం. కాగా, సమావేశానికి మీడియాకు అనుమతి ఇవ్వకపోవడంతో ఆయన బీఆర్ఎస్ వీడుతారనే ప్రచారం జరుగుతోంది. తనకు పార్టీ మారే ఉద్దేశం లేదని, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో నిజం లేదని ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నట్లు తెలుస్తోంది.

ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు పరిశీలన


వైద్య సేవలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఎంజీఎం: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును బుధవారం రెండో రోజు కేంద్ర బృందం సభ్యులు పరిశీలించినట్లు డీఎంహెచ్ఓ సాంబశివరావు తెలిపారు. ముందుగా యూపీహెచ్‌సీ పోచమ్మకుంట, అంగన్వాడీ సెంటర్, కాజీపేట దర్గా బస్తీ దవాఖాన, హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రులను బృంద సభ్యులు సందర్శించారు. కేంద్రాల్లో అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వ్యాక్సిన్ స్టోరేజీ, ఎన్‌సీడీ ద్వారా సేవలు, క్షేత్రస్థాయిలో అందిస్తున్న సేవలు, మాతా శిశు సంరక్షణ సేవల్ని వారు పరిశీలించారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో నవజాత శిశు సంరక్షణ కేంద్రం, మిల్క్ బ్యాంక్, టీ డయాగ్నస్టిక్ హబ్, బ్లడ్ బ్యాంకులను పరిశీలించారు. ఏఎన్ఎంలు, ఆశాలు అందిస్తున్న సేవల గురించి తెలుసుకోవడంతో పాటు లబ్ధిదారులతో కాసేపు చర్చించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ వరుణ్ విజయ్ గైకి, డాక్టర్ తేజ్ కిరణ్‌రెడ్డి, జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ సరళాదేవి, అదనపు డీఎంహెచ్ఓ మదన్మోహన్‌రావు, ఆర్ఎంఓ సారంగం, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎండీ యాకూబ్ పాషా, ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రే హంతకుడు..

మియాపూర్ ఘటనలో నిందితుడు నరేశే..

- హైదరాబాద్ మియాపూర్‌లో 7వ తేదీన బాలిక అదృశ్యం
- నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి కోరిక తీర్చాలని బలవంతం
- తల్లికి చెబుతానని అనడంతో కూతురిని కడతేర్చిన తండ్రి


నిందితుడు నరేశ్

మరిపెడ రూరల్ : కంచె చేనుమేస్తే.. కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కామపిశాచి అయ్యాడు. వావి వరుసలు మరిచాడు. పశువు కంటే హీనంగా ప్రవర్తించాడు. కోరిక తీర్చమని కన్న కూతురినే బలవంతం చేశాడు. దీనికి ప్రతిఘటించిన ఆ చిన్నారి విషయం తల్లికి చెబుతానని బెదిరించడంతో నరరూప రాక్షసుడు అయ్యాడు. జుట్టుపట్టి పొదల్లోకి తీసుకెళ్లి నేలకేసి కొట్టాడు. దీంతో ఆ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. హైదరాబాద్ మియాపూర్‌లో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు, అక్కడి పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట పరిధిలోని లక్ష్మాతండాకు చెందిన బానోతు నరేశ్, శారద దంపతులు తమ ఇద్దరి పిల్లల తీసుకుని బతుకుదెరువు నిమిత్తం నెల రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లారు. అక్కడ మియాపూర్ ప్రాంతంలోని నడిగడ్డతండాలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 7న తన కుమార్తె (12) సమీపంలోని షాపునకు వెళ్లి కనిపించకుండాపోయిందని నరేశ్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారం రోజుల తర్వాత 13వ తేదీన రాత్రి అదే మియాపూర్ ప్రాంతంలో కుళ్లిపోయిన బాలిక మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అనంతరం విచారణ చేపట్టిన పోలీసులు.. బాలిక మృతికి తండ్రే కారణమని నిర్ధారించారు. నరేశ్ వ్యసనాలకు బానిసయ్యాడు. మద్యం సేవించడం, పోర్న్ వీడియోలు చూడడం అలవాటు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఎలాగైనా తన కోరిక తీర్చుకోవాలని ఈ నెల 7వ తేదీన తన కుమార్తెను నడిగడ్డ తండా సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అక్కడ కూతురితో అసభ్యకరంగా వ్యవహరిస్తూ తన కోరికను తీర్చాలని బలవంతం పెట్టాడు. తండ్రి కోరిక విని దిగ్భ్రాంతికి గురైన బాలిక ఒక్కసారిగా అరిచింది. ఇంటికి వెళ్లిన తర్వాత ఈ విషయం అమ్మకు చెబుతానని మరో సారి గట్టిగా అరిచింది. దీంతో పట్టరాని కోపంతో రగిలిపోయిన తండ్రి పొదల్లోకి తీసుకెళ్లి జుట్టు పట్టుకుని నేలకేసి కొట్టాడు. అనంతరం ముక్కు, నోరు మూసి కూతురిని హత్యచేశాడు. ఏమి తెలియనట్లు ఇంటికి వచ్చి కుమార్తె కనిపించడం లేదని, ఏమైందోనని భార్యకు చెప్పి అక్కడ రాద్ధాంతం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు.. తండ్రే హంతకుడు అని నిర్ధారణకు వచ్చారు. ఈ లోపే నరేశ్ నడిగడ్డతండాలోని ఓ పెద్ద మనిషి వద్దకు వచ్చి జరిగిన ఉదాంతమంతా చెప్పి పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. కాగా, కన్న తండ్రే కసాయిగా మారి ఇంతటి దారుణానికి ఒడిగట్టిన నరరూప రాక్షసుడికి ఉరిశిక్ష విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చేపల వలలో పాము పిల్లలు

వరంగల్ నగరంలోని పడమరకోట అగడ్త చెరువులో శుక్రవారం సాయంత్రం మత్స్య కార్మికులు వేసిన చేపల వలకు 12 పాముపిల్లలు చిక్కాయి. మొదట్లో మత్స్య కార్మికులు పాపర్లు అనుకున్నారు. కాటేసేందుకు సిద్ధపడుతుండగా నీటిలో ఉన్నప్పుడే కర్రతో కొట్టి చంపారు. బయటికి వచ్చాక చూస్తే ప్రమాదకరమైనవిగా గుర్తించారు.

- ఖిలా వరంగల్


వలలో చిక్కిన పాము పిల్లలను చూపుతున్న మత్స్యకార్మికుడు

కేటుగాళ్ల బరితెగింపు..



సైబర్ నేరగాళ్ల నయా మోసం ..

- సిమ్‌కార్డు బ్లాక్ చేసి పూజారి ఖాతా నుంచి రూ.7.50 లక్షలు డ్రా
- లబోదిబోమంటూ సైబర్ క్రైమ్ విభాగానికి బాధితుడి ఫిర్యాదు

కాజీపేట: సైబర్ నేరగాళ్లు బరితెగిస్తున్నారు. రోజురోజుకూ కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం, పోలీసు శాఖ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా తిప్పి కొడుతున్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అమాయకులను ఏదో చోట.. ఏదో రకంగా బురిడీ కొట్టిస్తూ నట్టేట ముంచుతూనే ఉన్నారు. దీనికి నిదర్శనమే ఈ ఘటన. కాజీపేటకు చెందిన భ్రమరాంభిక మల్లికార్జున స్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు అయినవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ.. సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసానికి గురయ్యాడు. తనకు ఏమాత్రం తెలియకుండానే రూ. 7.50 లక్షలను పోగొట్టుకుని లబోదిబోమంటుఉన్నాడు.

మోసం జరిగిన తీరు ఇలా...

సాంకేతికతను వినియోగించుకుని సైబర్ మోసగాళ్లు.. ప్రవీణ్‌కుమార్ శర్మ సెల్‌ఫోన్ సిమ్ కార్డును బ్లాక్ చేశారు. దీంతో సెల్‌ఫోన్ పని చేయలేదు. అప్పటికే పూజారి తల్లి గ్యాస్ పేలి మంటలు అంటుకోవడంతో హనుమకొండలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. అదే సమయంలో పూజారి భార్య కూడా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేరగా వైద్యులు అత్యవసర సర్జరీ చేశారు. అటు భార్య, ఇటు తల్లి ఆసుపత్రుల్లో ఉన్న పరిస్థితుల్లో సెల్‌ఫోన్ పనిచేయకపోవడాన్ని సీరియస్‌గా తీసుకోకుండా అవసరానికి పిల్లల ఫోన్లు ఉపయోగించాడు. సిమ్ బ్లాక్ చేసిన సైబర్ నేరగాళ్లు వెంటనే రంగంలోకి దిగి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.1.70 లక్షలను ఇతర ఖాతాలకు మళ్లించారు. వెంటనే అదే బ్యాంకు అకౌంట్ నుంచి మోసగాళ్లే ఆన్‌లైన్ రుణం పొంది రూ. 5.80 లక్షలు కూడా కాజేశారు. ఇక్కడా అశ్చర్యకర విషయం ఏమిటంటే.. దేశంలోనే ఓ పేరున్న బ్యాంకు ఎలాంటి గ్యారంటీలు, ష్యూరిటీ లేకుండా ఒకపూటలోనే పూజారికి అదీ ఆన్‌లైన్‌లో రుణం మంజూరు చేయడం అందరినీ విస్మయానికి గురి చేస్తుంది.

సైబర్ క్రైమ్ విభాగానికి బాధితుడి ఫిర్యాదు..

రెండు రోజుల తర్వాత బాధితుడు ప్రవీణ్‌కుమార్ శర్మ హైదరాబాద్, వరంగల్ నగరాల్లోని ఎయిర్ టెల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి సిమ్ కార్డు పనిచేసేలా చేసుకున్నారు. వెంటనే సెల్‌ఫోన్‌కు డబ్బు డ్రా చేసినట్లు వరుసగా మేసేజీలు రావడం ప్రారంభమైంది. రెండు రోజుల దాకా ఫోనే పనిచేయలేదు..డబ్బులు ఎప్పుడు డ్రా చేశాననే ఆవేదనలతో బ్యాంకుకు వెళ్లగా అధికారులు విషయాన్ని చెప్పి స్టేట్‌మెంట్ తీసి చేతిలో పెట్టడంతో బాధితుడు ఖంగుతిన్నారు. సిమ్‌కార్డు బ్లాక్‌చేసి కేటుగాళ్లు చేసిన మోసంపై సైబర్ క్రైమ్ విభాగానికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశాడు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రం (ఎస్‌డీఎల్‌సీఈ) డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన 13 పరీక్ష కేంద్రాల్లో 2,901 మంది విద్యార్థులకు గాను 2,163 మంది హాజరు కాగా 738 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ తెలిపారు. ఇదిలా ఉండగా హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ (యూఏఎస్‌సీ) పరీక్ష కేంద్రంలో కాపీయింగ్ చేస్తూ పట్టుబడి ఇద్దరు విద్యార్థులు డీబార్ అయ్యారన్నారు.

నగర సమగ్ర అభివృద్ధికి కృషి

- నగరానికి టీయూఎఫ్ఐడీసీ కింద రూ.250 కోట్లు
- మేయర్ గుండు సుధారాణి


మాల్దీవ్స్ కౌన్సిల్ సభ్యులతో మేయర్, కమిషనర్, బల్దియా అధికారులు

నయీంనగర్: వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి తెలిపారు. బుధవారం కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) మీటింగ్ హాల్లో మాల్దీవ్స్ కౌన్సిల్ సభ్యులకు నగరంలో జీడబ్ల్యూఎంసీ తరఫున చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా విభాగాల అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక, పన్నుల వసూళ్ల ద్వారా ఆదాయం సమకూర్చుకున్నట్లు తెలిపారు. వివిధ విభాగాల పనుల అమలు తీరును పర్యవేక్షించడానికి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, నగరంలో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్‌ల నిర్మాణానికి ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ కింద రూ.250 కోట్లు కేటాయించిందన్నారు. ఈ సందర్భంగా మాల్దీవ్స్ కౌన్సిల్ సభ్యులను మేయర్, కమిషనర్‌లు శాలువాలతో సత్కరించారు. అనంతరం మాల్దీవ్స్ కౌన్సిల్ సభ్యులు నగరంలోని రాంపూర్ బయో మైనింగ్ ప్లాంట్, ప్రగతి నగర్ మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. తమ దేశంలో వీటి అమలుకు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అనిసుర్ రషీద్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర పాల్గొన్నారు.

ఖాకీ కామాంధుడు జైలుకు

- రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ‘సాక్షి’ కథనం
- కాళేశ్వరంలో మహిళా హెడ్ కానిస్టేబుల్‌పై లైంగిక దాడికి పాల్పడిన ఎస్సైపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

భూపాలపల్లి/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సర్కిల్ పరిధిలోని కాళేశ్వరం పోలీసు స్టేషన్‌లో ఎస్సై భవానీ సేన్.. అదే స్టేషన్‌లోని కానిస్టేబుల్‌పై లైంగికదాడికి పాల్పడిన ఘటనపై ‘ఖాకీచకుడు’ అనే శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. పోలీసుశాఖకు ఆదేశాలు ఇవ్వడంతో సంబంధిత ఎస్సై భవానీ సేన్‌ను సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగించినట్లు ఐజీ ఏవీ.రంగనాథ్ వెల్లడించారు.

అర్ధరాత్రి పోలీసుల విచారణ

మహిళా కానిస్టేబుల్‌పై లైంగికదాడి విషయం బయటకు పొక్కడంతో మంగళవారం రాత్రి పోలీసుల పహారాలో కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనను విచారించడానికి కాటారం, భూపాలపల్లి, ఏఆర్ డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, 60 మంది పోలీసులు రంగంలోకి దిగారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు ఇన్వెస్టిగేషన్ అధికారిగా విచారణ చేపట్టారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు స్టేషన్‌లోని పోలీస్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లను, అటెండర్లను విచారించారు. ఒక్కొక్కరి వాంగ్మూలం తీసుకున్నారు. అప్పటికే ఎస్సై రివాల్వర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన ఎటు వెళ్లకుండా సీఐ, ఎస్సైల పహారాలో ఉంచారు. బుధవారం తెల్లవారుజామున అరెస్టు చేసి భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఎస్సైని విచారించారు. ఆయనపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. బాధిత మహిళా హెడ్ కానిస్టేబుల్‌ను విచారించి వాంగ్మూలం తీసుకున్నారు. అనంతరం ఇరువురికి జిల్లా కేంద్రంలో వంద పడకల ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. మధ్యాహ్నం ఎస్సైని భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కోర్టులో హాజరు పరచగా ఎస్సైకి 14 రోజులు రిమాండ్‌ను విధించారు. కరీంనగర్ జైలుకు తరలించారు.

గతంలోనూ సస్పెన్షన్..

ఎస్సై తీరు మారడం లేదు. ఎక్కడ పనిచేసిన మహిళలతో వంకర మాటలు మాట్లాడటం అతడి నైజంగా మారింది. గతంలో 2022 జూలైలో కుమ్రంభీం జిల్లా రెబ్బెనలో ఎస్సైగా విధులు నిర్వర్తించే సమయంలో కానిస్టేబుల్ అభ్యర్థి ఓ యువతిని లైంగికంగా వేధించడంతో సస్పెన్షన్ వేటు వేశారు. ఆ సమయంలో భర్త సస్పెన్షన్ తట్టుకోలేక ఎస్సై భార్య వాసంతి శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేయగా సంచలనంగా మారింది.

ఉపేక్షించేది లేదు : మంత్రి దుద్దిళ్ల

తప్పు చేస్తే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం మంథనిలో విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ ఘటనపై స్పందించారు. చట్టపరంగా చర్యలు తీసుకొని బాధితురాలికి న్యాయం చేస్తామన్నారు.

మెట్లబావి నిర్మాణం అద్భుతం

- పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి


వరంగల్‌లోని మెట్ల బావిని పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి

ఖిలా వరంగల్: మెట్లబావి నిర్మాణ శైలి అద్భుతమని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి కొనియాడారు. బావి పునరుద్ధరణకు త్వరగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. బుధవారం వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లోని మెట్లబావిని కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, చరిత్రకారుడు అరవింద్‌ఆర్య, పర్యాటక, కేంద్ర పురావస్తుశాఖ, బల్దియా అధికారులతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మెట్ల మార్గం ద్వారా బావిలోకి దిగి నిర్మాణం, శిలకళా నైపుణ్యాన్ని పరిశీలించారు. బావి నిర్మాణ శైలి, విశిష్టతను చరిత్రకారుడు అరవింద్‌ఆర్య కలెక్టర్‌కు వివరించారు. జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో రూ.50 లక్షల నిధులతో చేపట్టనున్న పనులపై కలెక్టర్ ఆరాతీశారు. ఆమెవెంట జిల్లా పర్యాటకశాఖ అధికారి శివాజీ, కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ జిల్లా అధికారులు మడిపల్లి మల్లేశం, మల్లునాయక్, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ఈఈ శ్రీనివాస్, డీఈఓ వాసంతి, స్థానికుడు రాజు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పూర్తిచేయాలి

వరంగల్: జిల్లాలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల ఇంటింటి సర్వేలో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి ఆదేశించారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో మిషన్ భగీరథ నల్లా కలెక్షన్ల సర్వే పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, మిషన్ భగీరథ ఈఈ వెంకటరమణరెడ్డి, ఎంపీఓలు, ఎంపీడీఓలు, డీఎల్పీఓ పాల్గొన్నారు.

పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

కాశిబుగ్గ: పాఠశాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి ఆదేశించారు. శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులను ఇంగ్లిష్ పాఠంపై కొన్ని ప్రశ్నలు అడిగారు. ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం పెంచుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈఓ వాసంతి ఉన్నారు.